న్యాయవ్యవస్థలో చురుకైన సేవలందించాలి

పిపి, ఎపిపిలకు ల్యాప్‌టాప్‌లు అందించిన ఐజి అశోక్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

న్యాయస్థానాల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను అందించామని ఏలూరు రేంజ్ ఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు రేంజ్ కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా న్యాయస్థానాల్లో పనిచేస్తున్న వారికి ఉచిత ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఏలూరు రేంజ్ ఐజి అశోక్‌కుమార్‌తో పాటు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ పాల్గొని ల్యాప్‌టాప్‌లను అందించారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు, న్యాయవ్యవస్థలో చురుకైన సేవలు అందించేందుకు ల్యాప్‌టాప్‌లు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పరేషాన్..!

బిటెక్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం
22న తొలివిడత సీట్ల కేటాయింపు
కోరుకున్న సీటు కోసం విద్యార్థుల్లో టెన్షన్
సిఎస్ఇ, ఇసిఇ, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్‌లపైనే అంతా మొగ్గు
ఉమ్మడి జిల్లాలోని 14 ఇంజినీరింగ్ కాలేజీల్లో 14,663 సీట్లు
ఫీజుల భారంపై తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇంజినీరింగ్‌లో బిటెక్ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియ సోమవారం మొదలైంది. రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేసి ఈ నెల 22వ తేదీన సీట్ల కేటాయింపు ప్రక్రియ జరగనుంది. దీంతో ఎపిఇఎపి సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో హడావుడి మొదలైంది. తాము కోరుకున్న కాలేజీలో, ఆశిస్తున్న బ్రాంచ్ వస్తుందో, లేదోనని విద్యార్థులు పరేషాన్ అవుతున్నారు. మరోపక్క ఇంజినీరింగ్‌లో హాస్టల్, ఇతర ఫీజుల కింద రూ.లక్షలు వెచ్చించాల్సి ఉండటంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పుల కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి ఉంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 14 ఇంజినీరింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిలో 13,300 వరకూ సాధారణ సీట్లు, ఇడబ్ల్యుఎస్ కోటాలో 1300 సీట్లు మొత్తంగా 14,600 సీట్లు వరకూ ఉన్నాయి. జిల్లాలోని కాలేజీలతోపాటు రాష్ట్రంలోని ఇతర కాలేజీలనూ విద్యార్థులు ఎంచుకునే అవకాశం ఉంది. విద్యార్థులంతా ఎక్కువగా సాఫ్ట్‌వేర్ బ్రాంచ్‌లవైపు మొగ్గు చూపుతున్నారు. దీనిలో భాగంగా సిఎస్ఇ, ఇసిఇ, ఐటి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి బ్రాంచ్‌లవైపు విద్యార్థులు చూస్తున్నారు. ఈ ఏడాది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ సీట్ల కోసం విద్యార్థులు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే చాలా కాలేజీలు మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లను భర్తీ చేసుకున్న పరిస్థితి నెలకొంది. ఎంసెట్ ర్యాంకు ప్రకారం సీటు రాదని తెలిసిన వారంతా ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటాలో రూ.రెండు నుంచి రూ.నాలుగు లక్షల వరకూ డొనేషన్ కట్టి సీట్లు కొనుగోలు చేశారు. నిబంధనల ప్రకారం ఒక బ్రాంచ్‌కు సంబంధించి 60 సీట్లు ఉంటే వాటిలో 42 సీట్లు ఎపిఇఎపి సెట్ ర్యాంకు ఆధారంగా కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. మిగిలిన 18 సీట్లను మేనేజ్‌మెంట్ కోటాలో డొనేషన్

కట్టించుకుని కేటాయిస్తారు. ఇప్పటికే మేనేజ్‌మెంట్ కోటా సీట్లను చాలావరకూ భర్తీ చేసిన పరిస్థితి ఉంది. సివిల్, మెకానికల్ వంటి కోర్ గ్రూపులను తీసుకునేందుకు విద్యార్థులు ఇష్టపడకపోవడంతో సిఎస్ఇ, ఇసిఇ, ఐటి బ్రాంచ్‌లకు మరింత డిమాండ్ పెరిగింది. దీంతో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లకు భారీగా వసూళ్లు సాగాయి. వెబ్ ఆప్షన్లలో మొదటి ఆప్షన్‌గా సాఫ్ట్‌వేర్ సంబంధిత బ్రాంచ్‌లను నమోదు చేసుకోవాలని విద్యార్థులు ఆలోచన చేస్తున్నారు. జిల్లాలోని 14 కాలేజీల్లోని 14,600 సీట్లకు జిల్లాలోని విద్యార్థులతోపాటు ఇతర జిల్లాల విద్యార్థులు పోటీ పడనున్నారు.

బెంబేలెత్తిస్తున్న ఫీజులు

ఇంజినీరింగ్ కాలేజీలకు సంబంధించి ట్యూషన్ ఫీజు కాలేజీ అర్హతను బట్టి రూ.43 వేల నుంచి రూ.లక్షా ఐదు వేల వరకూ ఉంది. తెల్లరేషన్ కార్డు ఉన్న విద్యార్థులకు ట్యూషన్ ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. హాస్టల్ ఫీజు, ఇతర ఫీజులు తల్లిదండ్రులే చెల్లించాలి. హాస్టల్ ఫీజు ఏడాదికి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకూ కాలేజీలు వసూలు చేస్తున్నాయి. ప్లేస్‌మెంట్ ట్రైనింగ్, ఇతర ఫీజుల కింద మరో రూ.25 వేలు గుంజుతున్నారు. ట్యూషన్ ఫీజు ప్రభుత్వం చెల్లించినా ఏడాదికి అదనంగా రూ.లక్షకుపైగా చెల్లించాల్సి ఉంటుంది. ఏడాదికి రూ.లక్షకుపైగా కట్టాలంటే సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము సక్రమంగా ఇవ్వకపోవడంతో ఆ భారం సైతం తల్లిదండ్రులపై పడుతోంది. దీంతో ఇంజినీరింగ్ విద్య సామాన్యులకు బహుభారంగా మారుతోంది. కౌన్సెలింగ్ సమయంలో ప్లేస్‌మెంట్లు గురించి తెగ ఊదరగొడుతున్న కాలేజీలు నాలుగేళ్ల తర్వాత విద్యార్థులను ఒట్టిచేతులతో పంపిస్తున్నాయి. దీంతో ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటికి వచ్చిన తర్వాత కోర్సులు నేర్చుకుని జాబ్ తెచ్చుకునేందుకు రెండేళ్లపైనే పడుతోంది. చాలామంది తమ చదువుకు సంబంధం లేని జాబ్‌లు చేస్తున్న పరిస్థితి ఉంది. సాధారణ డిగ్రీలు చదివితే ఉపాధి అవకాశాలు తక్కువగా ఉన్నాయనే కారణంతో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎక్కువగా ఇంజినీరింగ్ విద్యపై మొగ్గుచూపుతున్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

పిజిఆర్‌ఎస్‌లో 391 అర్జీల రాక
కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన అర్జీలను ఆమె స్వీకరించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, డిఆర్‌డిఎ పిడి ఆర్.విజయరాజు, జెడ్‌పి సిఇఒ శ్రీహరి, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్, ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారం కోసం పిజిఆర్‌ఎస్‌లో 394 అర్జీలు అందాయన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్‌ఎస్‌లో వచ్చిన సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్‌మెంట్లను ఇవ్వాలని, సంబంధిత ఆర్‌డిఒలు

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

వారి పరిధిలోని మండలాల్లో పర్యటించి ఎండార్స్‌మెంట్లను పరిశీలించాలని ఆదేశించారు. రీఓపెన్‌కు అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీలు పరిష్కరించాలన్నారు. ఉంగుటూరు మండలం తల్లాపురం గ్రామానికి చెందిన తోట జయరాజు అర్జీనిస్తూ తమ వ్యవసాయ భూమి సరిహద్దు రాళ్లు ధ్వంసం చేసి భూమిని ఆక్రమించుకున్నారని, ఈ విషయంపై విచారణ చేసి తమ భూమిని తిరిగి ఇప్పించాలని కోరారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెం గ్రామానికి చెందిన పితాని పుణ్యవతి అర్జీనిస్తూ తన ముగ్గురు కుమారులు ఆస్తి రాయించుకున్నారని, వృద్ధాప్యంలో ఉన్న తనను చూడటం లేదని, తనకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి దళితులకు న్యాయం చేయాలి

పేదల భూములకు పట్టాలివ్వాలి
వ్యకాస రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని పోరాడుతున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.శివనాగరాణి విమర్శించారు. 20 ఏళ్ల నుండి భూముల్లో ఉంటూ వ్యవసాయం చేస్తున్న దళితులకు అండగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సోమవారం చిన్న ఆగిరిపల్లిలో దళితులు, పేదలు చేస్తున్న భూపోరాట భూములను సందర్శించి వారికి మద్దతుగా భూముల్లో గింజలు వేశారు. పేదల సాగుకు సిద్ధం చేసిన భూములను చదును చేయడంతోపాటు భూముల్లోని ముళ్లపొదలను తొలగించి పేదలు వ్యవసాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా శివ నాగరాణి, సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ 20 ఏళ్ల నుండి దళితులు, పేదలు కొండ పోరంబోకు, హెచ్ఒ లాండ్స్, అసైన్డ్, సీలింగ్ భూముల్లో సాగు చేస్తుంటే ఎందుకు

నినదిస్తున్న పేదలు, నేతలు

పట్టాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఒకపక్క ముఖ్యమంత్రి పేదలకు భూమి పంచుతామని ప్రకటనలు చేస్తుంటే అధికారులు మంత్రులు మరోపక్క పేదల భూములను భూస్వాములు కట్టబెట్టే విధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే ఆగిరిపల్లి మండలంలో వేలాది ఎకరాల భూములను ప్రయివేట్ కంపెనీలకు కట్టబెట్టేలా అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పేదలు సాగు చేస్తున్న భూములకు హక్కు పత్రాలు కల్పిస్తూ సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కోనేరు రంగారావు భూకమిటీ సిఫార్సులు, జస్టిస్ పున్నయ్య కమిషన్ ఆదేశాలను అమలు చేసి దళితులకు, పేదలకు న్యాయం చేయాలని కోరారు. అసైన్డ్, సీలింగ్ భూముల యాక్టు సక్రమంగా అమలు చేయాలని, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చినఆగిరిపల్లితోపాటు వట్టిగుడిపాడు, ఈదుర్లగూడెం, సీతారామపురం అటవీ పోరంబోకు భూములు బాగు చేస్తున్న పేదలకు న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వ భూములను పేదలకు పంచడంతోపాటు ఆ భూములపై హక్కులు పేదలకే చెందేలా చట్టాలున్నా రెవెన్యూ శాఖ అధికారులు అమలు చేయడం లేదన్నారు. భూస్వాములకు వర్తించే చట్టాలు పేదలకు ఎందుకు వర్తించవని ప్రశ్నించారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. భూముల సర్వే నంబరను తారుమారు చేస్తూ రికార్డులను ప్రయివేటు వ్యక్తులకు అనుకూలంగా తయారు చేయడంలో ఆగిరిపల్లి రెవెన్యూ శాఖ అధికారులు ఆరితేరారని విమర్శించారు. ఇప్పటికైనా పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలిచ్చి దళితులు, పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి భూపోరాట నాయకులు సుబ్బారావు, అనిల్, అరుణ, కవిత, మరియమ్మ తదితరులు నాయకత్వం వహించగా, మరో 40 మంది పేదలు పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

స్పిల్‌వే నుండి 1,95,294 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. గోదావరి ఉపనదులు శబరి, సీలేరు నదుల్లోని వరద నీరు గోదావరిలో కలుస్తుండడంతో గోదావరి నీరు ఎరుపు రంగులోకి మారింది. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా మళ్లీ గోదావరి వరద పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు, జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 18.20 అడుగులకు చేరుకుంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 1,95,294 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.990 మీటర్లు, దిగువన 18.450 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 28.150 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 17.450 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.040 మీటర్లు నీటిమట్టం నమోదైంది. స్పిల్వేలోకి వస్తున్న అదనపు జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ దిగువన 6.30 మీటర్లు నీటి మట్టం నమోదైందని, ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం నిలకడగా ఉందని

పట్టిసీమ శివక్షేత్రం వద్ద గోదావరి వరద జలాలు

సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి క్రమేపీ తగ్గుతుండటంతో మండలంలోని ప్రజలు కొంచెం ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే మరో రెండు నెలలు బిక్కుబిక్కుమంటూ కాలం గడపాల్సిందేనని వాపోతున్నారు.

కుక్కునూరు రూరల్: పది రోజులుగా గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద ఉధృతి కొనసాగింది. ఆదివారం భద్రాచలంలో 19.8 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సోమవారం తగ్గుముఖం పట్టి 18.06 అడుగులకు చేరుకుంది. భద్రాచలంలో గోదావరి నిదానంగా తగ్గుతున్నా ముంపు మండలాల్లో మాత్రం గోదావరి నిలకడగా ఉంది.

9న సమ్మె జయప్రదం చేయాలి

ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కార్మిక హక్కుల పరిరక్షణకు ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఏలూరు నగరంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక జ్యూట్ మిల్ వద్ద ప్రారంభమై గడియార స్తంభం, మార్కెట్, పాత బస్టాండ్ సెంటర్, క్రరల వంతెన సెంటర్, పవర్‌పేట రైల్వే స్టేషన్, ఆర్‌ఆర్.పేట పార్క్, ఫైర్ స్టేషన్ మీదుగా బస్టాండ్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి బి.వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు సమ్మె ద్వారా హెచ్చరిక జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎం.కృష్ణచైతన్య, ఎర్ర శ్రీనివాసరావు,

పలుచోట్ల బైక్ ర్యాలీలు

బండి వెంకటేశ్వరరావు, బి.సోమయ్య, పి.కన్నబాబు, కె.కృష్ణమాచార్యులు, వివిఎన్.ప్రసాద్, కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి సిఐటియు డివిజన్ కార్యదర్శి జి రాజు మాట్లాడుతూ కార్మిక వ్యవస్థకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్మిక, కర్షక, శ్రామిక వర్గాలు, బహుజనులైన పేదలు సమైక్య శక్తిగా పాల్గొని సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు నాగరాజు, సిపి.రావు, సిఐటియు నాయకులు శ్రీనివాస్, కేశవరావు, ఎన్ఆర్.హనుమాన్లు, రంగారావు, అప్పారావు, జయలక్ష్మి, రజని, చంద్రశేఖర్, రైతు సంఘం నాయకులు పాపారావు, బోసు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

టి.నరసాపురం : కార్మిక హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం టి.నరసాపురంలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు.

నూజివీడులో...

నిడమర్రు : కార్మిక చట్టాల రక్షణ కోసం ఈ నెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో నిడమర్రు, పెదనిండ్రకొలను, భువనపల్లి, చానమిల్లి, బావయ్యపాలెం గ్రామాల్లో సోమవారం కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కోన శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు గోక సూరిబాబు, కోసూరి ఏసు, చల్లా రాంబాబు, ఆలుమోల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి, పలు డిమాండ్ల సాధన కోసం 9న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు తహశీల్దార్ రమేష్ బాబుకు సోమవారం సమ్మె నోటీసు అందించారు. ఈ కార్యక్రమంలో వికెఎస్ యూనియన్ అధ్యక్షుడు పోచారపు వెంకన్నబాబు, కార్యదర్శి కురాకుల మోహన్‌రావు, విఆర్‌ఎలు ఇరకం, సుజాత, శివ, శేఖర్, కాంతారావు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌ల చోరీపై చర్యలేవీ

ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఏలూరు

నూజివీడులోని ట్రిపుల్ ఐటీ ఆవరణలోని శ్రీకాకుళం క్యాంపస్‌లో విద్యార్థుల గదుల్లో ల్యాప్‌టాప్‌లు, దుస్తులు, నగదు చోరీ చేసినా యాజమాన్యం స్పందించకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ అన్నారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ మే నెలలో విద్యార్థులకు సెలవులు ఇచ్చారని, తిరిగి జులైలో విద్యార్థులు కళాశాలకు తిరిగి రాగానే వారికి కేటాయించిన బ్లాక్ ఐ మూడో అంతస్తులో దాదాపు 80 రూముల తాళాలు పగులగొట్టి ఉండటం దారుణమన్నారు. విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు, ట్రాలీ బ్యాగులు, దుస్తులు చోరీకి గురైనట్లు తెలుస్తోందన్నారు. ఈ నెల 4న ఈ విషయాన్ని గుర్తించిన విద్యార్థులు మేనేజమెంట్‌కు మెయిల్ చేయగా తాము చూస్తామని రిప్లయి ఇచ్చారని, తాజాగా ఈ నెల 12న విద్యార్థులకు గదులు ఖాళీ చేసి వెళ్లిపోవాలనడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. క్యాంపస్‌లో సీసీ కెమెరాలు, సెక్యూరిటీ గార్డులు ఉండగా ఇంత పెద్దఎత్తున చోరీ ఎలా జరిగిందని ప్రశ్నించారు. ఇది ఇంటి దొంగల పనిగా కన్పిస్తోందని, దీనిపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల వస్తువులు రికవరీ చేసి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. లెనిన్ వెంట శివ, శివాజీ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడనివ్వలేదు

కలెక్టర్‌కు వైసిపి కౌన్సిలర్ల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ల పట్ల ప్రొటోకాల్ పాటించడం లేదని, కౌన్సిల్‌లో మాట్లాడే అవకాశం కల్పించలేదని, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని వైసిపి కౌన్సిలర్లు కోరారు. ఈ మేరకు వైసిపి ఏలూరు నియోజకవర్గ కన్వీనర్ మామిళ్లపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో కలెక్టర్ వెట్రిసెల్విని సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జయప్రకాష్, వైసిపి కార్పొరేటర్లు మాట్లాడుతూ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో నిబంధనలు పాటించడం లేదన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రజా సమస్యలు చర్చించకుండా తమను అడ్డుకుంటున్నారని చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశాల్లో కో-ఆప్షన్ సభ్యులు మాట్లాడేందుకు అనుమతి లేనప్పటికీ సభా మర్యాద పాటించకుండా ప్రతిపక్ష సభ్యులను టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయా నియోజకవర్గాల్లో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక కార్పొరేటర్లకు కనీస సమాచారం ఇవ్వకుండా ప్రొటోకాల్ నిబంధనలు పాటించడం లేదని, వీటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి కార్పొరేటర్లు గుడిదేశీ శ్రీనివాసరావు, నెరుసు చిరంజీవులు, గంట మోహన్‌రావు, మున్నుల జాన్ గుర్నాథ్, నూకపెయ్యి సుధీర్‌బాబు, తుమరాడ స్రవంతి, జి.విజయనిర్మల, కేదారేశ్వరి డింపుల్, నిర్మలకుమారి, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో సేవలందించాలి

ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందించిన జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో అర్హత కలిగిన ఉద్యోగులకు ఉద్యోగోన్నతు కల్పిస్తూ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ చేతుల మీదుగా సోమవారం ఉత్తర్వులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు (ఎఒ) అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ప్రమోషన్ పొందారు. ఈ సందర్భంగా వారిద్దరిని జెడ్‌పి చైర్‌పర్సన్ హృదయపూర్వకంగా అభినందించారు. ప్రజలకు అత్యంత నిబద్ధతతో, ధర్మబద్ధతతో సేవలందించాలని సూచిం చారు. ప్రతి ఉద్యోగి తన బాధ్యతను గౌరవంగా చేపట్టడం ద్వారా ప్రజా సంక్షేమాన్ని పెంపొందించగలిగే అవకాశం ఉంటుందని తెలిపారు.

ఉత్తర్వులు అందించిన జెడ్‌పి చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా కార్యదర్శిగా మన్నవ కృష్ణచైతన్య

ముగిసిన జిల్లా మహాసభ

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఐ జిల్లా కార్యదర్శిగా మన్నవ కృష్ణచైతన్య, సహాయ కార్యదర్శిగా బండి వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభ చింతలపూడిలోని యర్రగుంటపల్లి రాధా గార్డెన్స్‌లో 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు జరిగాయి. ఈ మహాసభలో 45 మంది జిల్లా సమితి సభ్యులను, 12 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎండి మున్నీర్, కారం దారయ్య, బాడిశ రాము, జెవి.రమణరాజు, యు.హేమశంకర్, ఆర్ఎస్.డాంగే, వరక శ్యామల, నిమ్మగడ్డ నరసింహ, కొన్నే లక్ష్మయ్య, తొర్లపాటి బాబు(ఆహ్వానితులు) ఎన్నికయ్యారు. పలు తీర్మానాలు చేశారు. పోలవరం ప్రాజెక్టు

మన్నవ కృష్ణచైతన్య

నిర్మాణానికి సహకరిస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, మండలాన్ని యూనిట్‌గా తీసుకుని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, మెరుగైన పునరావాసంతో పాటు ఉపాధి కల్పించాలని తీర్మానించారు. చింతలపూడి సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మహాసభలో చేసిన తీర్మానాల గురించి వివరించారు. సిపిఐ జిల్లా ద్వితీయ మహాసభ జయప్రదంగా నిర్వహించడానికి కృషి చేసిన ఆహ్వాన సంఘం వారికి, సిపిఐ మండల సమితి వారికి, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తొర్లపాటి బాబు, జిల్లా సమితి సభ్యులు కంచర్ల గురవయ్య, దొంతా కృష్ణ, తొర్లపాటి రాజు, ముళ్లగిరి నాగేశ్వరరావు పాల్గొన్నారు

పాఠశాల విలీనం రద్దు చేయాలి

దొరసానిపాడులోనే 6, 7, 8 తరగతులు కొనసాగించాలి
ఎంఇఒకు విద్యార్థుల తల్లిదండ్రులు, వైసిపి నేతల వినతి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల మండలం దొరసానిపాడులో ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8 తరగతులు కొనసాగించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు ఎంఇఒకు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వైసిపి నేతల ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ దొరసానిపాడు పాఠశాలలో ఇంతకుమందు వరకు ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు నిర్వహణ ఉండేదని చెప్పారు. స్కూల్స్ విలీనం పేరుతో మోడల్ ప్రైమరీ స్కూల్‌గా మార్చి 6, 7, 8 తరగతులను తొలగించారన్నారు. 6, 7, 8 తరగతుల విద్యార్థులు ద్వారకాతిరుమల హైస్కూల్‌కు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దొరసానిపాడు పాఠశాలలోనే 6, 7, 8 తరగతులు కొనసాగించాలని కోరారు. వైసిపి నేత బొండాడ

వినతి అందిస్తున్న తల్లిదండ్రులు, వైసిపి నేతలు

వెంకన్నబాబు, గ్రామ సర్పంచి లక్కబత్తుల సిద్ధిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా దొరసానినపాడు పాఠశాలను అభివృద్ధి చేసిందని, అక్కడ 6, 7, 8 తరగతులు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి వైస్ ప్రెసిడెంట్ మంచెం మోహన్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షులు అన్సారి భాషా, పార్టీ ప్రెసిడెంట్ మట్టా వెంకటరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించండి సారూ..!

సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు ఉపాధి హామీ కూలీల వినతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నెలల తరబడి పనులు నిర్వహిస్తే వేతనాలు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నారని ఉపాధి హామీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని యనమదల, సుంకొల్లు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ చట్టం కార్మికులు నూజివీడులోని సబ్ కలెక్టర్‌కు మీకోసం కార్యాలయంలో అర్జీ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులు మాట్లాడుతూ నెలల తరబడి కాయ కష్టం చేశామని, వేతనాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన వ్యకం చేశారు. కూలి డబ్బులు వస్తేనే ఆకలి తీరి కుటుంబం ముందుకు సాగుతుందన్నారు. నెలల



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ కూలీలు

తరబడి పనులు చేయించుకుని వేతనాలు ఇవ్వకపోతే ఎలా జీవించాలంటూ ప్రశ్నించారు. మండల అధికారులను అడిగితే పడతాయంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ స్పందించి సకాలంలో వేతనాలు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

పథకం మంజూరైనా డబ్బు అందలేదు..!

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

తన ఇద్దరు బిడ్డలకూ పథకం మంజూరైందని, అయినా నగదు జమ కాలేదని, అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఓ మాతృమూర్తి ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఈ కుమార్తె సాజియా (ఐదో తరగతి), కుమారుడు రిహాన్ (రెండో తరగతి) తల్లికి వందనం నగదు సాయం జమ కాలేదని పట్టణంలోని ఆరేళ్ళపేటకు చెందిన షేక్ ఖతీజా వాపోతుంది. నూజివీడు సబ్ కలెక్టర్‌కు ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా ఖతీజా మాట్లాడుతూ పాఠశాలల్లో, సచివాలయంలో, అధికారులను అడిగినా డబ్బులు వస్తాయంటున్నారే కానీ జమ కాలేదన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమకు తల్లికి వందనం నగదు అందకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లోపాన్ని సరిదిద్ది తల్లికి వందనం పథకంలో నగదు జమ అయ్యేలా చూడాలని వేడుకుంటుంది.

రోషన్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం సరికాదు

టిడిపి నేతల ఖండన

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌పై దురుద్దేశ పూర్వకంగా కొన్ని మీడియా చానెల్స్‌లో, సామాజిక మాధ్యమాల్లో చేయిస్తున్న తప్పుడు కథనాలను, వార్తలను టిడిపి నాయకులు ఖండించారు. టిడిపి జంగారెడ్డిగూడెం టౌన్ నాయకులందరూ కలిసి సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పెనుమర్తి రామ్ కుమార్,బొబ్బర రాజ్‌పాల్,చెరుకూరి శ్రీధర్, పగడం సౌభాగ్యవతి, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి మాట్లాడుతూ ఎంఎల్ఎ రోషన్‌కుమార్ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే కృషి చేస్తున్నారన్నారు. ఆయనపై కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిజాయితీగా వార్తలు రాయాలని, తప్పుడు వార్తలు రాయిద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్ సంఖారి రామచంద్రరాజు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సాయిల సత్యనారాయణ, అల్లిన దత్తాత్రేయ, మద్దిపాటి నాగేశ్వరరావు, గుమ్మడి ప్రసాద్, షేక్ యాకుబ్, తూటికుంట దుర్గారావు, తూటికుంట రాము, కంచర్ల గణేష్, షేక్ నజీర్, గుళ్ళపూడి రమేష్, గేదా సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి శ్రీను పాల్గొన్నారు.

నరసయ్యకు రావూరి భరద్వాజ పురస్కారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

పురస్కారం అందుకుంటున్న రావూరి భరద్వాజ

బొమ్మినంపాడు గ్రామ ఉపాధ్యాయుడు డి.వి.నరసయ్య 2025 సంవత్సరానికి రావూరి భరద్వాజ స్మారక పురస్కారానికి ఎంపిక య్యారు. ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో డాక్టర్ భరద్వాజ జయంతి వేడుకల్లో బిసి సంక్షేమ ప్రధాన కార్యదర్శి రాము సత్యనారాయణ చేతులమీదుగా నరసయ్య ఈ అవార్డును అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో డి.వి.నరసయ్యను దుశ్శాలువ, జ్ఞాపిక, ప్రశంస పత్రాలను అందించి ఘనంగా సత్కరించారు. గతంలో తెలుగు సాహిత్య అవార్డును అందుకున్నారు. ఈ అవార్డు అందుకోవడం పట్ల పలువురు ఉపాధ్యాయులు నరసయ్యను అభినందించారు.

'అబ్బయ్యచౌదరిపై నిరాధార విమర్శలు తగవు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మూడు రోజుల క్రితం కొండలరావుపాలెంలో జరిగిన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం విజయవంతం కావడంతో దానిని పక్కదోవ పట్టించే విధంగా మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరిపై లేనిపోని నిరాధార విమర్శలు చేస్తున్నారని కొల్లేరు ప్రాంతానికి చెందిన నాయకులు మున్సర్ సంజీవ్‌కుమార్, మండల కొండలరావు, ఏలూరు జిల్లా యువజన నాయకుడు కామిరెడ్డి నాని అన్నారు. ఏలూరులోని అశోక్ నగర్‌లో ఉన్న వైసిపి దెందులూరు నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కొల్లేరులో ఎవరైనా సరే చేపల చెరువులు లీజుకు తీసుకుంటే ముందుగానే సొమ్ము చెల్లించి ఆ తర్వాత సాగు చేస్తారన్నారు. అబ్బయ్యచౌదరిపై ఇలాంటి సొమ్ము చెల్లించాలనే సరైన ఆధారాలతో నిరూపించాలన్నారు. సొమ్ము ఇచ్చే బాధ్యత తాము తీసుకుంటామన్నారు. పరిపాలన మీద చిత్తశుద్ధి ఉంటే గత ఐదేళ్లల్లో అబ్బయ్యచౌదరి చేసిన అభివృద్ధికి రెట్టింపు చేసి చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపికి చెందిన పారా ఆనంద్, అప్పన్న ప్రసాద్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయ ఫార్మసీ కళాశాలలో వన మహోత్సవం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మొక్కలు నాటుతున్న విద్యార్థులు

జులై మొదటి వారాన్ని వన మహోత్సవ వారంగా జరుపుకుంటున్నామని, చెట్లను పెంచడం వల్ల ప్రకృతిలో స్వచ్ఛమైన ప్రాణవాయువు దొరకడమే కాకుండా ఎన్నో ఔషధ విలువలను పొందవచ్చని కళాశాల ప్రిన్సిపల్ వినయ్ కుమార్ తెలిపారు. స్థానిక విజయ ఫార్మసీ కాలేజీలో సోమవారం వన వహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఔషధ వనంలో మొక్కలు నాటే కార్యక్రమంలో వినయ్ కుమార్ మాట్లాడుతూ కళాశాలలోని ఔషధ మొక్కల ఔషధ గుణాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, ఫార్మసీ, పాలిటెక్నిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

జంతువులకు టీకాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెంలో ప్రపంచ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువులకు టీకాలు వేశారు. రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి మాట్లాడుతూ జంతువుల్లో వచ్చే వ్యాధుల నివారణలో టీకాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలో ద్విచక్ర వాహనంపై నుంచి పడి యువకుడి మతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామవరం గ్రామానికి చెందిన మడకం ప్రకాష్ (25) సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై వేలేరుపాడు బయలుదేరాడు. ఈ క్రమంలో వేలేరుపాడులోని సబ్‌స్టేషన్ వద్దకు వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కంద పడడంతో ప్రకాష్ తలకు బలమైన గాయమైంది. స్థానికులు అతడిని స్థానిక పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎఎన్‌ఎం ఇంట్లో చోరీ

ఉంగుటూరు :బాదంపూడిలో ఎఎన్‌ఎం ఇంట్లో దొంగతనం జరిగింది. ఆరోగ్య కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న ఉండ్రాజవరపు గంగ కుటుంబసభ్యులతో బాదంపూడిలో నివాసం ఉంటున్నారు. శనివారం సాయంత్రం కుటుంబంతో కలిసి వరంగల్ వెళ్లారు. తెల్లారాక ఆదివారం ఆన్‌లైన్ వస్తువుల డెలివరీ బాయ్ వచ్చి చూస్తే తలుపు తెరిచి ఇంట్లో సామగ్రి చిందర వందరగా ఉండటాన్ని గుర్తించి ఫోనులో సమాచారం ఇచ్చారు. దీంతో వరంగల్ నుంచి వచ్చిన వారు కుమార్తె ఎంబిబిఎస్ ఫీజుల కోసం తెచ్చిన రూ.లక్ష నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితురాలు గంగ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వేలిముద్ర నిపుణులు ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

కుమార్తె కన్పించడం లేదని ఫిర్యాదు

ముదినేపల్లి : కుమార్తె కనిపించడంలేదని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. నరసన్నపాలెం గ్రామానికి చెందిన పులిగిరి దేవి కుమార్తె పదో తరగతి వరకు చదువుకుని, సబ్జెక్టులు మిగిలిపోవడంతో తల్లితో పాటు కూలి పనులకు వెళ్తుంది. ఈ నెల ఆరో తేదీ ఆదివారం రాత్రి అందరూ భోజనాలు చేసుకుని ఇంట్లో నిద్రకు ఉపక్రమించారు. సోమవారం ఉదయం నిద్ర లేచి చూసేసరికి కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికగా ఆచూకీ తెలియరాలేదు. దీంతో దేవి కుమార్తె కనబడటం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దేవి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

వర్షాకాలం సీజన్‌లో వచ్చే అంటువ్యాధుల పట్ల పశుపోషకులు, రైతులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జి.రమేష్ సూచించారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యగా వ్యాధి నిరోధక టీకాలు అన్ని ప్రాంతాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పశుపోషకులు, గొర్రెలు, మేకల పెంపకం దారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గొంతు వాపు, డీ వార్మింగ్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో పశు వైద్య సేవలు అందించేందుకు నాలుగు ప్రాంతీయ వైద్యశాలలు ఉన్నట్లు తెలిపారు. పల్లె ప్రాంతాలలో రైతు సేవా కేంద్రాల్లో వశ వైద్య సేవకులు అందుబాటులో ఉన్నారని, వారి ద్వారా తక్షణ పశు వైద్యం పొంది ప్రమాదం నుంచి బయటపడవచ్చని చెప్పారు.

దాణా ఖర్చు తగ్గిస్తే అధిక లాభాలు

ప్రజాశక్తి - మండవల్లి

పశువుల పోషకులు దాణా ఖర్చును తగ్గించుకోవడం ద్వారా అధిక లాభాలను సాధించుకోవచ్చునని పశుసంవర్ధక శాఖ ఎడి వరప్రసాద్ సూచించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఏడో తేదీ నుంచి 14 వరకు పశుగ్రాస వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ వారోత్సవాల్లో భాగంగ గ్రామాల్లోని రైతులకు అవగాహన శిబిరాలను ఏర్పాటు చేసి పశుగ్రాసం ప్రాముఖ్యత, పశుగ్రాస నిర్వహణ, పద్ధతులు, శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు.

మినీ ఐటిడిఎలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మైదాన ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో మినీ ఐటిడిఎలను ఏర్పాటు చేయాలని బజరంగీ భేరీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కోట రామచంద్రపురంలోని ఐటిడిఎ కార్యాలయంలో పిఒ కె.రాములునాయక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని లంబాడీ తండాలు నిర్లక్ష్యానికి గురై అభివృద్ధికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రహదారులు, వ్యవసాయ బోర్లు మంజూరు చేయాలని కోరారు. గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణు గోపాల్, ఇ.ప్రేమ్‌చంద్, జె.కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లిలో...

ఘనంగా మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెంలో సోమవారం నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల ప్రెసిడెంట్ నార్లపాటి చిన్న, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, ఎంఆర్‌పిఎస్ నాయకులు మల్లికార్జునరావు, సీతారాముడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : దళిత జాతుల ఆరాధ్యదైవం ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ అని ఎంఆర్‌పిఎస్ నాయకుడు ముప్పిడి చినబాబు అన్నారు. స్థానిక ఎస్‌సి కాలనీలో బాబూ జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాల వద్ద బాబూ జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు బొబ్బర చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎంఎఆర్‌పిఎస్ నాయకులు చెప్పుల మధుబాబు అధ్యక్షతన మంద కృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

చాట్రాయి : మండల కేంద్రమైన చాట్రాయిలోని దళితవాడలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలను ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంఆర్‌పిఎస్ జెండా ఆవిష్కరించారు. అనంతరం నరసింహారావుపాలెం గ్రామ మాజీ సర్పంచి గార్లపాటి మారేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండలాధ్యక్షుడు మొలుగుమాటి రవిరామ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు కోపూరి రాజు, మాజీ సర్పంచి కోట జోషి, కొప్పుల ప్రసాద్‌బాబు, దుర్గం పుల్లారావు, కొమ్ము ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

ముసునూరు : మందకృష్ణ మాదిగ అంటే అణగారిన తరగతుల గొంతుక అని ఎంఆర్‌పిఎస్ నాయకులు కొండేటి బాబి అన్నారు. మండలంలోని 16 గ్రామాల్లో ఎంఆర్‌పిఎస్ దినోత్సవ, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు గద్దె రఘుబాబు, టిడిపి నాయకులు తోట శ్రీనివాసరావు, నక్క యోహాన్, గార్లపాటి నరసింహారావు, అర్లప్ప తులిమెల్లి రంగారావు, దేవినేని శ్రీధర్‌బాబు, గద్దల మోహనరావు, తల్లిబోయిన సత్యనారాయణ, గరికిముక్కు నాని, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల

కూలిపోయే స్థితిలో స్లాబ్
వర్షమొస్తే గది మొత్తం నీరే
సిబ్బంది, రైతుల అవస్థలు
భర్తీ కాని అటెండర్ పోస్టు

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రగడవరంలో 1980లో నిర్మించిన గ్రామీణ పశువైద్యశాల శిథిలావస్థలో ఉంది. నిర్మించి దాదాపు 45 ఏళ్లు అవ్వటంతో వర్షమొస్తే గది మొత్తం వర్షపు నీటితో నిండిపోతుంది. పై స్లాబ్ నుంచి పెచ్చుల నుంచి నీరు కారుతుంది. రైతులు నిత్యం తమ అవసరాల కోసం కార్యాలయనికి వెళ్తూ ఉంటారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. స్లాబ్ కూలిపోయే పరిస్థితిలో ఉంది. ప్రగడవరం మేజర్ పంచాయతీ కావడంతో రైతులు ఏదో అవసరం నిమిత్తం కార్యాలయానికి వెళ్తూ ఉంటారు. వైద్య సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రగడవరం పంచాయతీ పరిధిలో ఆవులు, గేదెలు కలిపి మొతం 3800, గొర్రెలు, మేకలు కలిపి నాలుగు వేలు ఉన్నాయి. పంచాయతీ మొత్తానికి కలిపి ఎల్ఎస్ఎ ఒక్కరే ఉన్నారు. ఆయన బయట పశువులకు వైద్యం చేయడానికి వెళ్లినప్పుడు ఆసుపత్రికి తాళం వేయాల్సి వస్తుంది. ఆ సమయంలో పశువులకు వైద్యం చేయించేందుకు ఆసుపత్రికి వచ్చినవారు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఎప్పటినుండో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. ఆ పోస్టు భర్తీ గురించి ఎవరూ పట్టించుకోవడంలేదని రైతులు విమర్శలు చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి అటెండర్ పోస్టు భర్తీ చేసి, పశు వైద్య శాలకు నూతన భవనం మంజూరు చేయాలని గ్రామ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

మెగా పేరెంట్స్ డేను సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - ముసునూరు

సామాజిక స్పృహతో విద్యా ప్రగతి లక్ష్యంగా మెగా పేరెంట్స్ డే నిర్వహించాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో మెగా పేరెంట్స్ డే సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. మెగా పేరెంట్స్ డే సందర్భంగా ముందుగానే ఆయా పాఠశాలల్లో ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, క్రీడలు, పాటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించాలన్నారు. ముందుగానే ఆయా గ్రామాల్లోని సర్పంచులు, ఎంపిటిసిలు, రాజకీయ నాయకులు, అధికారులకు ముందస్తు సమాచారం తెలియపరచి అవగాహన కల్పించాలని పాఠశాల ఉపాధ్యాయ, ప్రధానోపాధ్యాయులకు వివరించారు.

పరింపూడిలో 'బడికి పోదాం'

కొయ్యలగూడెం :బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పరింపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఐదేళ్ల నిండిన బాలలను బడిలోనే ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ జె.సురేష్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

పిడిఎస్‌యు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద ధర్నా

ఏలూరు అర్బన్ :విద్యారంగాన్ని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయం ఎదుట పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కె.భాస్కర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కాకి నాని, మహర్షి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అధికారంలోకొచ్చి ఏడాది కాలం పూర్తయినా విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగానే మిగిలి ఉన్నాయన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరణ చేసే జిఒ 107, 108లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగ భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.45 లక్షల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.వినోద్, ఏలూరు నగర అధ్యక్ష కార్యదర్శులు సొంగ సునీల్ కుమార్, వై.యశ్వంత్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎఐటియుసి ఆధ్వర్యాన ధర్నా

జంగారెడ్డిగూడెం :మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర సమితి కార్మికుల సమస్యలపై ఈ నెల మూడో తేదీ నుంచి 15 వరకు దశలు వారి నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలపై ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా మున్సిపల్ కార్మికుల సమస్యలపై స్పందించి ఎటువంటి షరతులు లేకుండా పరిష్కరించి సత్వరమే జిఒలు విడుదల చేయాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ గౌరవ అధ్యక్షులు జెవి.రమణరాజు, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షులు కంతేటి వెంకటరావు, కార్యదర్శి నిమ్మల సుబ్బారావు, పారిశుధ్య విభాగం ఉపాధ్యక్షులు పితాని సురేష్, కార్యదర్శి బొక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్థానిక 48వ డివిజన్‌లో తంగెళ్లమూడి శివగోపాలపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం మొదటి సంవత్సరంలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరణలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ పార్థసారథి, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, టిడిపి నగర అధ్యక్షుడు వెంకటరత్నం, 48వ డివిజన్ కార్పొరేటర్ నున్న స్వాతి, క్లస్టర్ ఇన్‌ఛార్జి వందనాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

దెందులూరు : పెదపాడు మండలంలోని సత్యవోలు, కొణికి, సకల కొత్తపల్లి, గుడిపాడు, వడ్డిగూడెం, ఖాజీగూడెం గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లోని రోడ్లు, డ్రెయిన్లను ఎంఎల్ఎ పరిశీలించారు. అధ్వాన స్థితిలో ఉన్న పలు రోడ్లు, డ్రెయిన్లు సత్వరమే మరమ్మతులు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

యువకుల మృతితో మూలలంకలో విషాదఛాయలు

బాధిత కుటుంబాలకు సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి - కలిదిండి

మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆ ఇద్దరు యువకులు కష్టపడి పనిచేస్తూ కుటుంబ పోషణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒకరు డ్రైవర్‌గానూ, మరొకరు వ్యాన్‌పై హెల్పర్‌గా పని చేస్తున్నారు. నలుగురితో కలిసిమెలిసి ఉంటూ సరదాగా గడిపేవారు. ఇలాంటి తరుణంలో రోడ్డు ప్రమాదంలో వారిద్దరి మరణం వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేసింది. రొయ్యలు అమ్మకం చేసేందుకు వెళ్లిన ఇరువురు యువకుల మృతి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

మండలంలోని మూలలంకకు చెందిన కేత సాయి, తుట్టా నాగరాజు, చిట్టూరి సాయి కలిసి బొలెరో వ్యానులో రొయ్యల లోడు చేసుకుని చెన్నై మార్కెట్‌కు బయలుదేరారు. కేత సాయి, చిట్టూరి సాయి డ్రైవర్లు కాగా వారికి సహాయకునిగా తుట్టా నాగరాజు వెళ్లాడు. ఈ క్రమంలో నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలంలోని తెట్టు సమీపంలో ముందుగా వెళ్తున్న లారీ ఒక్కసారిగా ఆగడంతో ఆ లారీని వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తుట్టా నాగరాజు(18), కేత సాయి(24) అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేసిన చిట్టూరి సాయికి గాయాలయ్యాయి. కేత సాయి తండ్రి అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. కుటుంబ బాధ్యత సాయిపైనే పడింది. డ్రైవర్‌గా జీవనం సాగిస్తూ కుటుంబ బాధ్యత మోస్తున్నాడు. సాయికి ఓ సోదరి ఉంది. చేతికి అందివచ్చిన కుమారుని మరణాన్ని జీర్ణించుకోలేక సాయి తల్లి తల్లడిల్లుతోంది. తుట్టా నాగరాజు పదో తరగతి వరకు చదివి పని చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. అతనికి ఒక సోదరి ఉంది. నాగరాజు మృతితో తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఇద్దరు యువకుల మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. బాధిత కుటుంబాలను సిపిఎం మండల కార్యదర్శి ఎస్.మహంకాళిరావు పరామర్శించారు.

ఉచిత కుళాయిల ఏర్పాటు నిలిపివేయడం తగునా..!

గ్రామసభలో నిలదీసిన మండవల్లి వాసులు

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామసభలో మాట్లాడుతున్న మండవల్లివాసులు

గుట్టు చప్పుడు కాకుండా కుళాయిలను అమ్ముకుని సొమ్ము చేసుకోవడం కోసం ఉచిత కుళాయి పంపిణీని నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని గ్రామస్తులు సర్పంచి, పంచాయతీ కార్యదర్శిపై ధ్వజమెత్తారు. మండల కేంద్రమైన మండవల్లి గ్రామసభ సర్పంచి మెండ ఝాన్సీ అధ్యక్షతన స్థానిక నాగేంద్ర స్వామి కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డ్రెయినేజీ వ్యవస్థపై సంత మార్కెట్ స్థలాల ఆక్రమణపై, ఇంటి పన్ను వ్యత్యాసాలపై చెత్త బండి ఇంటింటికి పంపకపోవడంపై నిలదీశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు అప్పారావు, గ్రామస్తులు మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్ల క్రితం జలజీవన్ మిషన్ పేరుతో కుళాయిలేని ప్రతి ఇంటికి రూపాయికి కుళాయి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం మొగల్రాయ్ చెరువు పథకానికి సుమారు రూ.65 లక్షలు, కొండరాయి చెరువు పథకానికి మరో రూ.15 లక్షల నిధులు మంజూరు చేసిందని చెప్పారు. అయినప్పటికీ గ్రామంలో ఇప్పటివరకు కుళాయిలు పంపిణీ చేయకపోవడం పంచాయతీ నిర్లక్ష్యమేనన్నారు. వ్యక్తిగత కుళాయిల కోసం గ్రామంలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తుంటే పట్టించుకోకుండా రూ.లక్షల్లో సొమ్ము చేసుకుని 400 నుంచి 700 మీటర్లు దూరంలో ఉన్న చేపల చెరువుకు పంపు ఎలా ఇచ్చారంటూ సర్పంచిని, కార్యదర్శిని నిలదీశారు. పైపులైన్లను రహదారుల వెంబడి వేయకుండా ప్రయివేట్ స్థలాల్లో నుంచి ఎందుకు వేస్తున్నారని ప్రశ్నించారు. రూ.లక్షలు వెచ్చించి ఫిల్టర్ బెడ్లను మరమ్మతులు చేయించిన గ్రామానికి పచ్చని రంగు కలిగిన మురికి నీటిని ఎందుకు సరఫరా చేస్తున్నారంటూ నిలదీశారు. ఈ సందర్భంగా కార్యదర్శి గిరిజ మాట్లాడుతూ చెరువుగట్టు మీదకు పంచాయతీ కుళాయి ఇచ్చినట్లు తనకు తెలియదని, పరిశీలించి జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కులాయి ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని, గ్రామంలో నెరకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం గ్రామసభను ముగించేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముల్లపూడి సత్తిబాబు, విఆర్ఒ శ్యామలరావు, తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
I.A. 1953/2024 in
ASSR No. 3064/2022
Between:
Association for Promoting Spiritual & Socio Economic Activities ...Petitioner
AND
Penumatsa Durga Prasad Raju, S/o. Satyanarayana Raju, Hindu, aged 63 years, Business, D.No. 26-1-12, Tanuku, W.G.Dist. ...Respondent
పై నెంబరు పిటిషన్‌లో రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 11-7-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్‌ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.ఎస్.ఎస్.మురళీమోహన్
జి.వి.రామలక్ష్మి
రాజమండ్రి 02-7-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

చెరువుల అభివృద్ధికి రూ.26 కోట్లతో ప్రతిపాదనలు

ఇరిగేషన్ డివిజనల్ ఇంజినీర్ అర్జున్‌రావు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో చెరువుల అభివృద్ధి కోసం రూ.26 కోట్లతో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఇరిగేషన్ డివిజనల్ ఇంజినీర్ వై.అర్జున్‌రావు తెలిపారు. నూజివీడులో ఆయన సోమవారం మాట్లాడుతూ ఇటీవల నియోజకవర్గంలో సంభవించిన వరదల్లో గండ్లు పడిన చెరువులకు మరమ్మతులు నిర్వహించి, యుద్ధ ప్రాతిపదికన పటిష్ట పరిచినట్లు చెప్పారు. పట్టణంలోని పెద్ద చెరువుకు పడిన నాలుగు గండ్ల పూడ్చివేత పనులు 70 శాతం పూర్తయినట్లు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లోని చెరువుల అభివృద్ధి, పటిష్టత కోసం కావాల్సిన నిధుల కోసం రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చొరవ తీసుకొని కృషి చేస్తున్నట్లు చెప్పారు.

నేటి నుంచి 17 వరకు రైల్వేగేటు మూసివేత

ప్రజాశక్తి - దెందులూరు

ఏలూరు-దెందులూరు రైల్వే స్టేషన్ మధ్య లెవెల్ క్రాసింగ్ నెంబరు 351 (489 కిలోమీటర్లు) వద్ద అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల ఎనిమిదో తేదీ ఉయదం ఏడు గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు రైల్వే గేటును మూసివేయనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ ఎస్.లోకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు-దెందులూరు రైల్వేస్టేషన్ మధ్య, ఏలూరు జిఎన్‌టి రోడ్డు నుంచి నిమ్మకాయల మార్కెట్ యార్డ్‌కు వెళ్లే రహదారిలో ప్రయాణించే వాహనాలు ప్రత్యమ్నాయ రహదారిమీదుగా వెళ్లాలని పేర్కొన్నారు.

ముసునూరు ఎంఇఒ-1గా శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎంఇఒ-1గా శ్రీరామ్మూర్తి బాధ్యతలు చేపట్టినట్లు ఎంఇఒ-2 బివిఎస్.సుబ్బారావు చెప్పారు. ఆయన టి.నర్సాపురం ఎంఇఒగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.

ప్రకటన
అరసవల్లి శ్రీలక్ష్మి, భర్త: లేటు భాస్కరరావు, D.No. 16B-15-23 తంగెళ్ళమూడి, ఏలూరు పట్టణం, సెల్ నెం. 81211 26422 వారి సంజాయిషీ ప్రకారం ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్థి ఉప్పాటి లక్ష్మి గారు ది. 27-03-2010న 1. కూరపాటి రామచంద్రరావు 2. వారి కుమారుడు వేణుగోపాల్‌తిలక్ 3. శివయ్యచౌదరి గారిచే క్రయ దస్తావేజు వ్రాయబడి ఏలూరు సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో నెం. 1202/1920 గా రిజిస్ట్రార్ కాబడినది. దరిమిళ పారికత్తు దస్తావేజు ఏలూరు Ro.R లో 1వ పుస్తకం 370 వాల్యూ 171వ పుటలలో ద.నెం. 3628/1928 రు. ది. 27-03-2010 2339/2010 నెంబరు దస్తావేజు పోయినది. పోలీసు సర్టిఫికెట్ తీసుకోమన్నారు. ఈ దిగువ ఆస్థిని అరసవల్లి శ్రీలక్ష్మి నా క్లయింటుకు బ్యాంక్ లోన్ కొరకు ద.నెం. 2339/2010 పోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియచేయవలెను.
షెడ్యూలు
శ్రీ అంజనిపుత్రనగర్ లోని ప్లాట్లలలో ప్లాట్ నెం. 3రు R.S.No. 442 లో 60 చ॥గ॥లకు హద్దులు:
తూర్పు : 33 అడుగుల వెడల్పు గల రోడ్డు 30 అ॥లు
దక్షిణం : ప్లాటు నెంబరు 4 దాఖలా స్థలం 18 అ॥లు
పడమర : బరగడ సత్యం గారి భూమి 30 అ॥లు
ఉత్తరం : ప్లాటు నెంబరు 2 దాఖలా స్థలం 18 అ॥లు
డి. శంకర్,
ఏలూరు అడ్వకేట్, ఏలూరు
ది. 07-07-2025 సెల్: 94405 02352

ప్రకటన
మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 6/2024
Between:
అరిటాకుల లీల సుమంత్ కుమార్ ...వాది
Vs
అడారి వరలక్ష్మి వగైరా ...ప్రతివాదులు
పై నెంబరు దావాలో మొదటి ప్రతివాది అడారి వరలక్ష్మి, భర్త: అడారి నాగులు, డోర్ నెం. 8-19-3/2, 16వ వార్డు, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం అను వారు పై నెంబరు దావాలో కోర్టు ద్వారా ఎన్నిమార్లు దావా సమన్లు పంపినప్పటికి తీసుకొనక avade చేయుచున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు మేరకు యీ ప్రకటన ఇవ్వడమైనది. కావున సదరు మొదటి ప్రతివాది అడారి వరలక్ష్మి, భర్త: అడారి నాగులు, డోర్ నెం. 8-19-3/2, 16వ వార్డు, జువ్వలపాలెం, తాడేపల్లిగూడెం అను వారు ది. 15-07-2025 వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు పైన తెలిపిన కోర్టులో స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరయి ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.
టి. లీలా మాధవ్
తాడేపల్లిగూడెం పిటిషనరు తరపు న్యాయవాది
ది.06-07-2025 తాడేపల్లిగూడెం
సెల్ నెం: 93464 09563

In The Court Of The Civil Judge (Senior Division) - Tadepalligudem
E.P.No. 41/2023 in O.S.No. 157/2016
Between:
Karri Dana Reddy ...D.H.R
Vs
Katam Radha Krishna ...J.D.R
J.D.R : Katam Radha Krishna, S/o. Gavarayya, Near Ayyappa Vilas, Palabuchiyya Street, D.No. 2-16, Main Road, Tadepalligudem.
పై నెంబరు E.P గ్రంధములో శ్రీ కోర్టు వారు Sale నోటీసును పంపించినప్పటికిని మీరు తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టు వారు Substituted Service ద్వారా పేపరు పబ్లికేషన్ Sale నోటీసు ఆర్డరు వేసినందున ఈ పబ్లికేషన్ ద్వారా నోటీసు అమలు నిమిత్తం ది. 11-07-2025 వ తారీకున ఉదయం గం. 10-30 ని॥లకు లగాయితు పై కోర్టులో హాజరు కావలెను. లేనియడల పరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
Thota Ram Babu,
Advocate
Vijaya towers
Tadepalligudem
Cell: 98483 77437
Tadepalligudem
Date: 03-07-2025